క్లుప్తంగా

నగర సంకీర్తన



తొస్సిపూడిలో భజన చేస్తున్న సభ్యులు

బిక్కవోలు: తోస్సిపూడి గ్రామంలో శనివారం నగర సంకీర్తన నిర్వహించారు. శనివారం గొలుగూరి భారతి సేవా బృందం ఆధ్వర్యంలో భక్త అభయ ఆంజనేయస్వామి అన్నదాన సమాజము, శ్రీ సత్య సాయి భజన మండలి, మల్లిడి ఈశ్వర్‌రెడ్డి భజన మండలి బృందాలు నగర సంక్తీరన చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని అన్ని వీధులు తిరుగుతూ నగర సంకీర్తన చేశారు. ఈ కార్యక్రమంలోని గ్రామ స్తులు, గొలుగూరి నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పెదపూడి: సంపరలో ప్రసిద్ధి చెందిన ప్రాచీన వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాలు, తులసి, అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

హౌసింగ్ ఏఈ వెంకట్రావు సేవలు అభినందనీయం

మధురపూడి: గృహ నిర్మాణ శాఖ ఏఈ ఆకుల వీర వెంకట్రావు ప్రజలకు అందించిన సేవలు అభినందనీయమని కోరుకొండ ఎంపీడీఓ హేమసుందరరావు కొనియాడారు. ఏఈ వెంకట్రావు ఉద్యోగ విరమణ సభ శనివారం కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ విరమణ అనేది ఉద్యోగానికే గానీ, ఆశయాల సాధనకు కాదన్నారు. విధులు నిర్వహిస్తుండగా లబ్ధిదారులకు సంపూర్ణ సేవలందించే అవకాశం కొన్ని శాఖలకు మాత్రమే దుక్కుతుందని, దానిలో గృహనిర్మాణ శాఖ ముఖ్యమైనదన్నారు. అనంతరం ఏఈ వెంకట్రావును శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మహేశ్వర ప్రతాప్, ఏపీఎం భ్రమరాంబిక, ఎంపీడీఓ కార్యాలయం సూపరింటెండెంట్ పుణ్యమూర్తి, వశిష్ట, గృహనిర్మాణ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మండల కమిటీ ఎంపిక

సీతానగరం: స్థానిక సీపీఐ ఎంఎల్ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు ఆధ్వర్యంలో శనివారం మండల కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా సిద్దే నాగరాజు, మహిళా అధ్యక్షురాలిగా కొండేపూడి ఆదిలక్ష్మిని ఎంపిక చేశారు. వీరబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కమిటీలు వేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

342 మందికి వైద్యసేవలు



రఘుదేవపురంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: రఘుదేవపురం సచివాలయం – 2 పరిధిలో శనివారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో 342 మందికి పీహెచ్‌సీ వైద్యుడు ఎన్.రాజు సేవలు అందించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సెంటర్లను సందర్శించి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్పందన, ఏఎన్‌ఎం రమణ, ఆశావర్కర్లు రవళి, సావిత్రి, వీరమణి పాల్గొన్నారు

శ్రీశైలానికి కడియం మొక్కలు

కడియం: కడియం ప్రాంత నర్సరీ రైతులు స్వచ్ఛందంగా సేకరించిన పలు రకాల మొక్కలను శనివారం శ్రీశైలం దేవస్థానానికి పంపించారు. వివిధ రకాల అలంకరణ, నీడనిచ్చే మొక్కలను నర్సరీ రైతులు బొరుసు శ్రీనివాసరావు, నక్కా ప్రసాద్, నాగిరెడ్డి రవి, పంతం సుబ్రహ్మణ్యం, పెద్దిరెడ్డి శ్రీనివాసు సమకూర్చారు. ఈ మేరకు మొక్కలు తీసుకువెళ్ళే లారీని కడియపులంక ముసలమ్మవారి ఆలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కడియం: వేమగిరి సెంటర్‌లోని ఓ రెస్టారెంట్ వద్ద సుమారు 70 ఏళ్ల వృద్ధుడు అపస్మారకస్థితిలో ఉన్నాడు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని కడియం పోలీస్‌లు తెలిపారు. మృతదేహం మార్చురీలో ఉందని, ఎవరికైనా ఆచూకీ తెలిస్తే కడియం పోలీసులను సంప్రదించాలన్నారు.

గెలుపు ఎవరిదో..

- ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ
- వాడీవేడిగా చర్చలు



రాజానగరం: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా పోలింగ్ జరిగి 20 రోజులు పూర్తయ్యింది. మరో రెండు రోజులలో (జూన్ 4) ఫలితాలు వెల్లడికానున్నాయి. ఇప్పటికే సోషల్ మీడియాతో పాటు టీవీ మాధ్యమాలలో కూడా రకరాల సర్వేల పేరుతో విజేతల అంచనాలు, రాష్ట్రంలో ఎవరు అధికారంలోకి వస్తారు అంటూ విశ్లేషణలు వస్తున్నాయి. అయితే గతంలో మాదిరిగా ఒకే పార్టీ వైపు అంచనాలు లేకపోవడం, ఎవరికి వారు నోటికి వచ్చింది, మనస్సుకు తోచింది చెపుతున్నట్టుగా అంచనాలు ఉండటంతో పాటు జోతిష్యాలు కూడా అదే బాటలో ఉండటంతో పోటీలో ఉన్న అభ్యర్థుల్లోనే కాకుండా వారి అనుచరులలోనూ తీవ్ర ఉత్కత నెలకొంది. శనివారం సాయంత్రం వచ్చిన ఎగ్జిట్ పోల్స్ కూడా జనాన్ని తికమకకు గురి చేసేలా ఉన్నాయి.

సమీక్షలతో కొంత సంతృప్తి

పోలింగ్ అయిన తరువాత రెండు, మూడు రోజులు పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఈవీఎంల నుంచి వెలువడబోయే ఫలితాలు ఎలావుంటాయోనని ఎవరికివారే అనుకూలంగా అంచనాలు వేసుకున్నారు. బూత్‌ల వారీగా పోలైన ఓట్ల వివరాలు తీసుకుని, ఎవరికి ఎన్ని ఓట్లు పోలై ఉంటాయోనని కుల, మత, వర్గాల వారీగా కూడా లెక్కలు వేసుకున్నారు. అయినా ఏదో జరగబోతోంది, ఎక్కడో కొడుతుందనే భావన మాత్రం వారిని వదలలేదు. ఇక ఓట్లు వేసిన వారిలోను ఫలితాలపై గతంలో ఎన్నడూ లేనంత ఆసక్తి కనిపిస్తుంది. ఈసారి పోలింగ్ శాతం పెరగడం, అందులోను మహిళలు అధికంగా తరలి వచ్చి ఓటు చేయడం చూస్తుంటే ఫలితాలు ఎవరికి అనుకూలంగా ఉంటాయో అంచనాలకు అంతుబట్టని రహస్యంగా తయారైంది.

అత్యధిక పోలింగ్

నియోజకవర్గంలో మే నెల 13న జరిగిన పోలింగ్‌లో 87.58 శాతం ఓటింగ్ జరిగింది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో అత్యధికంగా ఓట్లు పోలైన నియోజకవర్గంగా రాజానగరం నిలిచింది. ఇక్కడ 2,16,491 మంది ఓటర్లు ఉండగా, 1,89,505 మంది ఓటు చేశారు. వీరిలో మహిళలే అధికం కావడం విశేషం. వీరిలో 94,571 మంది పురుషులు కాగా 94,928 మంది మహిళలు ఉన్నారు. అంటే పురుషుల ఓట్ల కంటే 357 మహిళ ఓట్లు ఎక్కువగా పోలయ్యాయి. ఇతరులు ఆరుగురు కూడా ఓటు వేశారు.

అందరి దృష్టి ఆ రౌండ్ల పైనే..

నియోజకవర్గంలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాలలో ఉన్న 216 పోలింగ్ బూత్‌ల నుంచి పోలైన 1,89,505 ఓట్లను 16 రౌండ్లలో లెక్కించేలా ఏర్పాట్లు చేశారు. అయితే వీటిలో నాలుగు రౌండ్ల పరిధిలో 13 వేలు, ఆరు రౌండ్లలో 12 వేలకు పైబడి ఓట్లు పోలైన గ్రామాలున్నాయి. దీనితో ఫలితాలను ముందుగానే అంచనా వేసేందుకు అంతా ఆ రౌండ్ల పరిధిలోని బూత్‌లపైనే ఆసక్తిని చూపిస్తున్నారు. మరో ఐదు రౌండ్లలో 10 వేల ఓట్లు పోలైన బూత్‌లు ఉన్నాయి. ఇక 16వ రౌండు అప్పటి మిగిలివున్న ఆరు ఈవీఎంలతో పూర్తవుతుంది. సీతానగరం మండలం పురుషోత్తపట్నంలోని కేఎంఎంపీయూపీ స్కూల్‌లోని పోలింగ్ బూత్ నుంచి మొదటి రౌండ్ కౌంటింగ్ ప్రారంభమవుతుంది. ఇక్కడ 755 మంది ఓటర్లకుగాను 685 మంది (91 శాతం) ఓటు చేశారు. ఇక ఆఖరి రౌండైన 16వ రౌండ్ రాజానగరం మండలం ముక్కినాడపాకలులోని బూత్ కౌంటింగ్‌తో పూర్తవుతుంది. ఇక్కడ 472 మంది ఓటర్లు ఉండగా 442 మంది (94 శాతం) ఓటు చేశారు.

పింఛన్ల పంపిణీ



దోమాడలో పింఛను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ ఆశాజ్యోతి

పెదపూడి: నిబంధనల ప్రకారం సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేస్తున్నారని ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి తెలిపారు. ఆమె శనివారం దోమాడ, పెదపూడి గ్రామాల్లో ఇంటి వద్ద పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో మొత్తం సామాజిక పింఛన్లు 10,660 ఉన్నాయన్నారు. వాటికి సంబంధించి రూ.3,07,47,500 నగదు మంజూరైందన్నారు. దానిలో 2927 మందికి ఇంటి వద్ద పింఛన్లు ఇవ్వాల్సి ఉందన్నారు. మిగిలిన 7733 మందికి పింఛను నగదు బ్యాంకులో జమ చేశారన్నారు. ఇంటి వద్ద ఇచ్చే పింఛన్లకు సంబంధించి సుమారు 83 శాతం మేర పంపిణీ పూర్తి చేశారన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, సిబ్బంది నాగరాజు తదితరులు ఉన్నారు.

శ్రీలక్ష్మీ గణపతికి ఎమ్మెల్యే దంపతుల పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు



జి.మామిడాడలో సూర్యదేవుని దర్శించుకున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు

బిక్కవోలు: స్థానిక శ్రీలక్ష్మీగణపతి స్వామివారిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. ఎమ్మెల్యే దంపతులను కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగ శ్రీనివాస్‌రెడ్డి ఘనంగా సత్కరించి, స్వామివారి జ్ఞాపికను అందజేశారు.

సూర్యదేవుని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు

పెదపూడి: దేవుని దయ, ప్రజల ఆశీస్సులతో రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలిచి రాష్ట్ర అభివృద్ధికి మరింతగా కృషి చేస్తారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జి.మామిడాడ లో ప్రసిద్ధి చెందిన ఉష, ఛాయ, పద్మిణి, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణమూర్తిని ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ఆయన సతీమణి ఆదిలక్ష్మి శనివారం దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజల్లో కూర్చున్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మండ రాజారెడ్డి, ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి, సత్తి భగవాన్‌రెడ్డి, ఎన్‌వీవీ రామారెడ్డి, ఎస్.అప్పారెడ్డి, ద్వారంపూడి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన అవసరం



ఏపీత్రయంలో మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

పెదపూడి: కిషోర్ బాలికలు నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించాల్సిన వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన అవసరమని ఐసీడీఎస్ కాకినాడ అర్బన్ ప్రాజెక్ట్ సీడీపీఓ అనుసూరి జ్యోతి తెలిపారు. ఏపీత్రయం గ్రామంలో కిషోర్ బాలికలకు రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. పెదపూడి, పెద్దాడ సెక్టార్ల పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ జ్యోతి మాట్లాడుతూ రుతుక్రమ పరిశుభ్రత ప్రత్యేకమైన ఒక తేదీన అనగా మే 28న ప్రకటించారన్నారు. దానికి గల ప్రాముఖ్యత, అవశ్యకతను ఆమె వివరించారు. కిషోర్ బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కిషోర్‌బాలికలకు రక్షణ విషయంలో ఏ సమస్య వచ్చిన తమ సహకారం పూర్తిగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీగౌరీ, ఎంఎల్‌పీహెచ్ జెస్సీ, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నపూర్ణ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎండకు ఎండి.. వానకు తడిసి..

- పొట్టకూటి కోసం చిరు వ్యాపారుల పాట్లు
- అమ్మకాల కోసం ఎదురుచూపు



పెదరాయవరం వద్ద ఏడీబీ రోడ్డు పక్కన వానలో తడుస్తూ కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్న వ్యాపారి

రంగంపేట: నిన్న, మొన్నటి వరకూ ఎండలు.. ఇప్పుడు వాన జల్లులతో చిరు వ్యాపారాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. రోడ్డు పక్కన తోపుడు బళ్లు పెట్టుకొని, చిన్న చిన్న దుకాణాలపై ఆధారపడే చిరు వ్యాపారుల జీవనోపాధి కష్టంగా మారింది. ఏడీబీ రోడ్డు వెంబడి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు రైతులు, వ్యాపారులు తమ తమ గ్రామాల్లోని పంట పొలాల్లో పండించిన అనేక రకాల పండ్లు, కూరగాయలు, కాయలు ఏడీబీ రోడ్డు పక్కన అమ్ముకుని జీవనోపాధి పొందుతారు. అయితే నిన్నటి వరకు మండుటెండలో నిలుచుని బేరాల కోసం ఎదురు చూపులు చూశారు. ఇప్పుడేమో అల్పపీడనం కారణంగా కురుస్తున్న వాన జడుల్లో తడుస్తూ కొనుగోలుదారుల కోసం నిరీక్షిస్తున్నారు. ఈ పరిస్థితి చిరు వ్యాపారులకు ఇబ్బందికరంగా మారింది. ఎండలు తీవ్రంగా ఉన్న సమయంలో ఉదయం, సాయంత్రం వేళల్లో కాస్తో..కూస్తో వ్యాపారం సాగినా! వాతావరణం మార్పుల కారణంగా వీస్తున్న గాలులు, కురుస్తున్న వర్షానికి ద్విచక్ర వాహనదారులు ప్రయాణాలు చేయక వ్యాపారం సాగడంలేదని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. కార్లలో ప్రయాణించేవారు మాత్రం వర్షం వెలుసుబాటు ఇస్తే కార్లు ఆపి కొద్దో.. గొప్పో కొంటున్నారు. వర్షం కురుస్తుంటే మాత్రం కర్లలోంచి దిగడానికి ఇష్టపడక పోవడంతో వ్యాపారాలు బాగా మందగించాయని వాపోతున్నారు. వర్షాలకు పండ్లు, కూరగాయలు పాడవుతున్నాయని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఆదాయం సగానికి పైగా పడిపోయిందని, కుటుంబ పోషణ కష్టంగా మారుతుందని చిరు వ్యాపారులు చెబుతున్నారు.

వానలతో తగ్గిన గిరాకీ



నేను కాలానుగుణంగా అన్ని రకాల పండ్లు అమ్ముతుంటాను. ఎండల వల్ల వ్యాపారం సరిగా సాగలేదు. ఇప్పుడ వర్షాల వల్ల వ్యాపారం అంతంతమాత్రం. రోజులో ఏదో ఒకసారి వర్షం కురిసి ఆగిపోతే పర్వాలేదు. అలా కాకుండా చినుకు, చినుకు పడుతూఉంటే జనం రాక గిరాకీ బాగా తగ్గిపోతుంది.

– పి.దుర్గాప్రసాద్, పండ్ల వ్యాపారి, వెంకటాపురం

నష్టపోతున్నాం



మొన్నటి వరకు భరించలేని ఎండలు కారణంగా ఉదయం, సాయంత్రం మాత్రమే వ్యాపారం ఉండేది. ఇప్పుడు అల్పపీడనం కారణంగా వర్షం కురుస్తుండడంతో జన జీవనం స్తంభించడంతో వ్యాపారం జరగడం లేదు. సరుకు పాడైపోయి నష్టపోతున్నాం.

– బి.శ్రీను, వ్యాపారి, ఈలకొలను

పొట్ట నింపుకోవడానికి పాట్లు

మండల పరిధిలోని వడిశలేరు, రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం, కోటపాడు, రామేశంపేట తదితరల ప్రాంతాల్లో ఏడీబీ రోడ్డు వెంబడి మండలంలోని అనేక గ్రామాలకు చెందిన పలువురు రైతులు, వ్యాపారులు సీజనల్‌గా పండే మామిడి, జీడి మామిడి, నేరేడు, సపోట, బొప్పాయి, పనస, జామ తదితర రకాల పండ్లు, వంగ, బెండ, బీర, చిక్కుడు, కాకర, ఆగాకర, గోరు చిక్కుడు, ఆనబ తదితర కూరగాయలుతో పాటు ఆకు కూరలు, తాటి ముంజులు, కొబ్బరి బొండాలు, బుర్రగుంజు, ఈత పండ్లను రైతులు, వ్యాపారులు సైకిళ్లు, బైక్‌లపై తీసుకువచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. ఎండకు ఎండి, వానకు తడిసి కుటుంబ పోషణ కోసం పొట్ట నింపుకోవడానికి పాట్లు పడుతున్నామని చిరు వ్యాపారులు అంటున్నారు.

భజేహం.. భక్తాంజనేయం

- ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు
- ఆలయాలకు తరలివచ్చిన భక్తులు



అనపర్తి ట్యాక్సీస్టాండ్ సమీపంలోని అభయాంజనేయస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి: హనుమజ్జయంతి వేడుకలను శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కెనాల్ రోడ్డు టాక్సీ స్టాండ్ వద్ద ఉన్న అభయాంజనేయస్వామి, జీబీఆర్ కళాశాల సమీపంలోని ఆంజనేయస్వామి, స్థానిక పాతవూరు బాపనమ్మ తల్లి ఆలయ సమీపంలోఉన్న ఆనంద్‌నగర్ ఆలయాల్లో స్వామివారిని తమలపాకులతో అలంకరించి, విశేష పూజలు జరిపారు. రామవరం, కుతుకులూరు గ్రామాల్లో గల భక్తాంజనేయస్వామి వారి ఆలయాల్లో స్వామి వారిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే దంపతులను ఆయా ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రాజానగరం: హనుమజ్జయంతి వేడుకలు మండలంలో శనివారం ఘనంగా జరిగాయి. రాజానగరం, సూర్యారావుపేట, పుణ్యక్షేత్రం, నరేంద్రపురం, వెలుగుబంద, చక్రద్వారబంధం, కానవరం, తోకాడ, పల్ల కడియం, తూర్పుగానుగూడెం, పాలచర్ల తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాలలో ఉదయం తమలపాకులతో ప్రత్యేక పూజలు చేసి, అభిషేకాలు నిర్వహించారు. రాజానగరంలోని షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద ఉన్న అభయ ఆంజనేయస్వామి సన్నిధిలో భక్తులు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల సెంటర్ వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద హోమాలు జరిగాయి. రావుల చెరువు గట్టున ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద, వివిధ గ్రామాలలోనూ అన్నసమారాధనలు చేశారు.

వైభవంగా శోభాయాత్ర

రాజానగరంలో శనివారం శోభాయాత్ర (బైకు ర్యాలీ) వైభవంగా సాగింది. జాతీయ రహదారిని ఆనుకుని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల జంక్షన్ వద్ద ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం నుంచి సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన ఈ ర్యాలీ ఏడీబీ రోడ్డు జంక్షన్, వేంకటేశ్వరస్వామి గుడి, గాంధీ బొమ్మ సెంటర్, బస్టాండ్, అగ్రహారం, సాయిబాబా గుడి సెంటర్, సూర్యారావుపేట ఆంజనేయస్వామి గుడి మీదుగా సాగింది. జై శ్రీరామ్, జై హనుమాన్ నామాన్ని పఠిస్తూ అనేక మంది భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అన్నసమారాధనలు

మధురపూడి: హనుమజ్జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. కోరుకొండ మండలం బూరుగుపూడి జంక్షన్‌లో ఆటో యూనియన్ సభ్యుల ఆధ్వర్యంలో, అలాగే గాడాల, మధురపూడి, శ్రీరంగపట్నం తదితర గ్రామాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామికి ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అలాగే అన్నసమారాధనలు నిర్వహించారు. బూరుగుపూడి జంక్షన్‌లో ఆటో యూనియన్ నాయకులు అప్పారావు, సుబ్రహ్మణ్యం, రామచంద్రరావు, అన్నవరం పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి లక్ష అప్పాలతో పూజ

రంగంపేట: లోక సంక్షేమం కోసం, అభయాంజనేయస్వామి దివ్య ఆశీస్సులు అందరిపై ఉండాలని స్వామివారి ఉత్సవమూర్తికి లక్ష అప్పాలతో పూజలు చేసినట్లు అభయాంజనేయస్వామి ఆలయ కమిటీ తెలిపింది. మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలో చిన కొత్తూరు మంచినీటి చెరువు వద్ద కొలువైన స్వామివారి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారికి సహస్రనామార్చాలతో లక్ష అప్పాల పూజ నిర్వహించారు. 21 రోజులు 11 మంది అంజనేయ స్వామి దీక్ష చేపట్టి తమలపాకులు, సింధూరం, పలు రకాల పూజ సామగ్రితో వేద మంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉంగరాల అప్పారావు, సింగన వీరవెంకట సత్యనారాయణ, గురుస్వామి ఉండవల్లి సుబ్బారావు, దీక్షదారులు గారపాటి నరేష్, పద్దరాజు, సాయి, శివ, రామకృష్ణ, మండవిల్లి గుప్తా పాల్గొన్నారు.

పెదపూడి: మండలంలో హనుమజ్జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన శ్రీ సూర్యనారాయణమూర్తి స్వామి ఆలయంలో, బోడా వారి వీధిలో తెల్లవారు జాము నుంచి స్వామివారికి ప్రత్యేక పంచామృతాభిషేకాలు తమలపాకులు, గంగ సింధూరం పూజలు నిర్వహించారు. ప్రముఖ పండితులు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా పూజలు చేశారు. ఉదయం గ్రామంలో రథోత్సవం నిర్వహించారు. అనంతరం భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మేడపాటి సాయిబాబారెడ్డి, సీహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, ద్వారంపూడి యువరాజారెడ్డి, కర్రి గంగాధర్‌రెడ్డి సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సంపర గ్రామంలో 27 అడుగుల ఎత్తుగల అభయ అంజనేయస్వామి ఆలయం వద్ద పూజలు చేశారు.

ఘనంగా అభయాంజనేయస్వామికి పూజలు

బిక్కవోలు: పందలపాకలో కొలువైన అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద స్వామివారు పుట్టిన తిథిని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామికి ఇష్టమైన గారెలు, తమలపాకు దండులు వేశారు. తోస్సిపూడి ఉన్న భక్త అభయ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద భారీ ఎత్తున అన్నసమారధన చేశారు. కొంకుదురు, బిక్కవోలు, ఊలపల్లిలో ఘనంగా పూజలు చేశారు.



సంపరలో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



జి.మామిడాడ సూర్యదేవాలయంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



రాజానగరంలో జరిగిన శోభాయాత్ర



లక్ష అప్పాల పూజలో పాల్గొన్న ఆంజనేయస్వామి దీక్ష తీసుకున్న భక్తులు



పందలపాకలో అభయాంజనేయ స్వామి